క్లుప్తంగా

రోడ్డు నిబంధనలు పాటించాలి

మాగనూర్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్‌ఐ అశోక్ బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని జాతీయ రహదారిపై రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీటి వృథాను అరికట్టాలి



కోస్గి రూరల్: పట్టణంలోని నర్సప్పకట్ట నుంచి బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిలో అండర్ డ్రైయినేజీ పనులు ప్రారంభించారు. పనుల్లో మిషన్ భగీరథ పైపులు పగిలిపోయి మూడు రోజుల నుంచి నీరు వృథాగా పోతుంది. మున్సిపల్ అధికారులకు తెలిపినా పైపులకు మరమ్మతు చేయడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరంతా గుంత పెద్దలో చేరడంతో చిన్నారులు గుంతలో పడే అవకాశం ఉందని, ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మట్టి తరలింపు



నర్వ: మండలంలోని లంకాల్ శివారులో గల డి–14 కెనాల్‌లోని మట్టిని పలువురు గ్రామస్తులు బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తరలించారు. రెండు రోజుల క్రితం ఇక్కడి నుంచి మట్టిని నర్వ వద్ద నిర్మిస్తున్న ఓ పరిశ్రమకు తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్న విషయం విదితమే. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణాల కోసం మట్టిని తరలిస్తుండగా ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి అనుమతి ఇవ్వడంతో మట్టిని తరలించారు.

టీఎస్‌పీఎస్సీ నూతన సభ్యుడికి సన్మానం



నారాయణపేట రూరల్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నూతన సభ్యుడుగా ఎంపికైన ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్‌ను బుధవారం జిల్లా వాసులు ఘనంగా సన్మానించారు. మండలంలోని అప్పక్‌పల్లికి చెందిన తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బంగాలి వెంకటయ్య నేతృత్వంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కథలప్ప, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు హైదరాబాద్‌లో కలుసుకొని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కంటి వైద్యశిబిరం

మక్తల్: పట్టణంలో మారుతి కంట ఆస్పత్రి వారికోత్సవం సందర్భంగా బుధవారం మక్తల్‌లో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. దాదాపు 50 మందికి పరీక్షలు చేసి 13 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. వైద్యులు మోహన్‌భట్, నర్మద, వెంకటేశ్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సామగ్రికి రక్షణ కరువు?

నర్వ: ఇంటింటికి టెలిఫోన్ సౌకర్యాన్ని అందించిన బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం గత కొన్ని రోజులుగా మూతపడింది. అయితే ఇందులోని విలువైన సామగ్రికి రక్షణ లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మండల పరిషత్ ఆవరణలో చివరిలో ఉన్న ఈ కేంద్రం గదులన్నీ ప్రస్తుతం ముళ్ల పొదలతో మూసుకుపోయి, అందులోని విలువైన సామగ్రికి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సామగ్రి చోరీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కరకట్ట నిర్మించి.. కష్టాలు తీర్చాలి



సూకూర్‌లింగంపల్లి ప్రాంతంలోకి వచ్చిన వరద (ఫైల్)

- వరద ముంపునకు గురవుతున్న గ్రామాలు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న తీరప్రాంత ప్రజలు

కృష్ణా: మండలంలోని కృష్ణా నది సమీపంలోని గ్రామస్తుల పరిస్థితి నెల రోజుల నుంచి కంటిమీద కునుక లేకుండా తయారైంది. ఎగువన ఉన్న కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటిని దిగువకు వదలుతుండడంతో రాత్రికి రాత్రే కృష్ణా నది ఉప్పొంగుతుండడంతో తీర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒక పక్క తమ పంటలు మునిగిపోవడంతో పాటు నది ఒడ్డున ఉన్న విద్యుత్ మోటర్లు మునిగిపోతున్నాయి. దాంతో పాటు తీరప్రాంతంలోని వాసునగర్, మారుతీ నగర్, హిందూపూర్ గ్రామాల్లోకి నీళ్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆ కారణంగా అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తుండడంతో తీరప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

ప్రభుత్వం పునరవాసం కల్పించాలి

గతంలో వరదలు వచ్చినప్పుడు తీరప్రాంత వాసులు ఇళ్లు మునిగిపోవడంతో ప్రభుత్వం అప్పట్లో గ్రామ సమీపంలో గల 88 సర్వే నెంబర్‌లో గల 3 ఎకరాల భూమిని పునరవాసులకు కేటాయించాలని అప్పటి కలెక్టర్‌కు ప్రతిపాదన పంపించింది. అయితే అదే సర్వే నెంబర్‌లో మొత్తం 8 ఎకరాలు ఉండగా అందులో 5 ఎకరాలు కస్తూర్బా పాఠశాలకు కేటాయించారు. మిగిలిన 3 ఎకరాలను వరద బాధితులకు ఇళ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. కానీ ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు.



మోటర్‌ను పుట్టిలో తీసుకొస్తున్న రైతులు (ఫైల్)



హిందూపూర్, వాసునగర్ మధ్య లోతట్టు ప్రాంతం

శాశ్వత పరిష్కారం చూపాలి



నది వరద ఎప్పుడు వచ్చినా గ్రామంలోని రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా నది తీరంలోని వ్యవసాయ మోటర్లు, పంపులు నీట మునిగిపోతున్నాయి. లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి నీళ్లు చేరుతున్నాయి. ఇప్పటి కైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

–మల్‌రెడ్డి, రైతు హిందూపూర్ గ్రామం

కరకట్ట నిర్మించాలి



హిందూపూర్, వాసునగర్ గ్రామాల మధ్య కృష్ణా నది ప్రవహిస్తుండడంతో తీరంలో కొంత దూరం లోతట్టు ప్రాంతం ఉంది. దీంతో నదికి వరద వస్తే ఈ ప్రాంతాలను వరద చుట్టేస్తుంది. అదే కరకట్ట నిర్మిస్తే కొంత ఉపశమనం ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

–పర్వత్‌గౌడ, హిందూపూర్ గ్రామం

పేదల ఇళ్లు కాదు.. సీఎం సోదరుడి ఇల్లు కూల్చండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణా: ప్రభుత్వ హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలగొట్టడం కాదు.. ముందు సీఎం సోదరుడి ఇల్లు కూలగొట్టాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని టైరోడ్డులో రైతుల సమస్యలపై ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అనంతరం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ హైడ్రాపై తీవ్ర విమర్శలు చేశారు. తాము అధికారంలో ఉన్న సమయంలోనే నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందని, ఎత్తిపోతల పథకాలు, సంగెంబండ ప్రాజెక్టులను కట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని వాటన్నింటిని ప్రజాసమక్షంలోనే తేల్చుకుంటామన్నారు. ధర్నాలో రాజుల ఆశిరెడ్డి, శివరాజ్‌పాటీల్, ఎల్లారెడ్డి, అంబ్రేష్, వెంకట్‌రెడ్డి, అశోక్‌గౌడ్, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేద్దాం



నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 29న నిర్వహించ తలపెట్టిన లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని బంజారా నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతుందని, లంబాడీల హక్కులకు పూర్తిగా విరుద్ధమన్నారు. లంబాడీల ఆత్మగౌరవం దెబ్బతీసేలా కుట్ర జరిగితే సహించేది లేదని, తమ హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీని నారాయణపేట జిల్లాలోని గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంజారా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీలేర్–పూసల్‌పహాడ్ మధ్య బీటీ రోడ్డు నిర్మించాలి



బురదమయంగా మారిన రోడ్డు

మరికల్: మండలకేంద్రంలోని తీలేర్–పూసల్‌పహాడ్ మధ్య రహదారి ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. రోడ్డుకు దశాబ్దాలుగా మరమ్మతు చేపట్టకపోవడంతో వర్షాలకు అధ్వానంగా మారింది. 5 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే బురదలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందని ఇరుగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తీలేర్ నుంచి పూసల్‌పహాడ్ వరకు బీటీరోడ్డు వేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలి



మరమ్మతుకు గురైన ట్రాక్టర్

ధన్వాడ: గ్రామ పంచాయతీలో చెత్త సేకరణతో పాటు ఇతర అవసరాల కోసం పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ నిరుపయోగంగా మారింది. మండలంలోని హన్మన్‌పల్లి గ్రామంలో ఓ ట్రాక్టర్ ఇటీవల మరమ్మతుకు గురికావడంతో అధికారులు దానిని అలాగే వదిలేశారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవడం.. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ట్రాక్టర్ నిరుపయోగంగా ఉంచడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

మాగనూర్: మాగనూర్ గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ మరమ్మతు గురికావడంతో పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ఇంజిన్ ఆయిల్ పైపు లీకేజీ కావడంతో బాగుచేసేందుకు రూ.30 వేలు అవసరం కావడంతో 15 రోజుల నుంచి మూలన పంచాయతీ ఆవరణలో ఉంచేశారు. అయితే గత పదిహేను రోజులుగా ట్రాక్టర్ రాకపోవడంతో వీధుల్లో చెత్త నిండిపోయింది.

జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

నారాయణపేట రూరల్: బంగారానికి ప్రఖ్యాతి చెందిన నారాయణపేట పట్టణంలో బుధవారం జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభమైనది. సరఫ్ బజార్‌లోని బాలాజీ జ్యువెలర్‌లో బంగారం, వెండికి సంబంధించిన ఎగ్జిబిషన్ ను లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత బట్టడ్ ప్రారంభించారు. దసరా పండుగ సందర్భంగా సామాన్య ప్రజలకు సరికొత్త డిజైన్లు గల ఆభరణాలను అందించాలనే సంకల్పంతో మూడు రోజుల పాటు శక్తి గ్రాండ్ జ్యువెలరి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు బంగారు ఆభరణలపై ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు 22 క్యారెట్ బంగారు ఆభరణల కొనుగోలుపై మేకింగ్ ఛార్జ్ 30శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు.

పత్తికి మద్దతు ధర అందించాలి

నారాయణపేట రూరల్: పత్తి రైతులకు మద్దతు ధరను అందించి ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము డిమాండ్ చేశారు. మండలంలోని లింగంపల్లి పత్తి మిల్లును ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రూ.10,075 చొప్పున పత్తికి మద్దతు ధర అందించాలన్నారు. పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాన్ని రద్దు చేయడంతో మార్కెట్లో డిమాండ్ తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంగం కార్యదర్శి యాదగిరి, కాశీనాథ్, వెంకట్ రాములు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

కోస్గి రూరల్: మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని గుండుమాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కిష్టమ్మ అన్నారు. 'స్వస్థ్ నారి.. సశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు , చిన్నపిల్లలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి , మాజీ ఎంపీపీ మధుకర్‌రావు , సూపర్‌వైజర్ మనిమాల పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు యూరియా కష్టాలు



నారాయణపేటలో యూరియా కోసం బారులు దీరిన రైతులు

నారాయణపేట టౌన్: రాష్ట్రంలో యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. రైతులు ఒక్క బస్తా యూరియా కోసం టోకన్లు తీసుకొని ఎండలో నిలబడే దుస్థితి ఏర్పడింది. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక యాదగిరి రోడ్డు దగ్గర ఉన్న అగ్రోస్ రైతు సేవా కేంద్రం– 2 దగ్గర రైతులు ఉదయం నుంచే బారులుదీరారు. ఎలాంటి తోపులాటలు జరగకుండా పోలీస్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా సరఫరా చేశారు.



ధన్వాడలో క్యూలైన్‌లో నిల్చోన్న రైతులు

యూరియా కోసం అగచాట్లు

ధన్వాడ: మండల కేంద్రంలోని రైతులు యూరియా కోసం ఆగ్రో రైతు కేంద్రం ముందు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే షాపు ముందు క్యూలో నిలబడి యూరియా తీసుకెళ్లారు. మొత్తం 900 బ్యాగులు రావడంతో అధికారులు ఒక్క రైతుకు రెండు బ్యాగులు మాత్రమే అందజేశారు.

తెల్లవారు నుంచే పడిగాపులు

కొత్తపల్లి: మండలంలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. స్థానిక హాకా ఎరువుల దుకాణానికి 450 బస్తాల యురియా రావడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. అలాగే మద్దూరులోని పీఏసీఎస్‌కు 300, అగ్రోస్ ఫర్టిలైజర్‌కు 300 బస్తాలు, మన గ్రోమోర్ ఎరువుల దుకాణానికి 300 బస్తాల యురియా రావడంతో రైతులకు సరిపడా యూరియా లభించింది.

వేలిముద్రలు తీసుకొని సరఫరా

మరికల్: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలకు 1200 బస్తాల యూరియా రావడంతో అధికారులు ఆధార్‌కార్డుతో పాటు వేలి ముద్రలను తీసుకొని ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను పంపిణీ చేశారు.

దామరగిద్ద: మండల కేంద్రంలో యూరియా సరఫరా సాఫీగా చేపట్టారు. అవసరాలకు అనుగుణంగా యూరియా రావడంతో రైతులకు సరిపడా యూరియాను అందజేశారు.

కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్: గ్రామ పంచాయితీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహా కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోనే స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీడీఓ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. సమయానికి జీతాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఎంపీడీఓకు వినతి

మక్తల్: జీపీ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ ఆధ్వర్యంలో బుధవారం మక్తల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి వేతనం అమలు చేయాలని కోరారు.



మక్తల్ ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: పంచాయతి కార్మికుల మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింములు డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 30 శాతం పీఆర్సీని అమలు చేసి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా 'ఎన్‌ఎస్‌ఎస్' ఉత్సవాలు

నారాయణపేట రూరల్: చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అధికారులు శ్రీనివాస్, నిర్మల ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.మెర్సీ వసంత పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. గాంధీజీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 24 సెప్టెంబర్ 1969లో ఎన్‌ఎస్‌ఎస్ ప్రారంభమైందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరిన విద్యార్థులలో సేవా దృక్పథం, క్రమశిక్షణ, దేశభక్తిని, నాయకత్వ లక్షణాలను, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విశ్వనాథ్, గోపాల కృష్ణ, కిషోర్, సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతమాత అందరికీ తల్లి

మరికల్: భారతమాత అందరికీ తల్లి వంటిదని రాష్ట్ర సేవికా సమితి తెలంగాణ ప్రాంత తరుణి ముఖ్య వక్త కాంచనక్క అన్నారు. మండలంలోని అప్పంపల్లిలో రాష్ట్ర సేవిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మన దేశం అనేక విషయాల్లో ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తూ విశ్వగురు స్థానంలో ఉందన్నారు. సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి ఇంట సంఘ కార్యకర్తలు ఉండాలన్నారు.

అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం మల లాంబిక దేవాలయంలో మావుళ్లమ్మ తల్లిగా, కన్యాక పరమేశ్వరీ ఆలయంలో శాకాంబరీ దేవిగా, బ్రహ్మణవాడి చౌడేశ్వరీ మాత ఆలయంలో కామాక్షి మాతగా, అంబ భవాని దేవాలయం, శక్తిపీఠంలో, పళ్ల హనుమాన్ మందిరం దగ్గర అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు.

నారాయణపేట రూరల్: సింగారం గ్రామ శ్రీగిరీ పీఠంపై కొలువైన భవానీ మాత ఆలయంలో, కోటకొండ వాసవి మాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మద్దూరు: పట్టణంలోని వాసవి మాత మందిరంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు పల్లకి సేవా, కుంకుమార్చన నిర్వహించి అనంతరం అమ్మవార్లకు 108 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు.

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో వెలిసిన దుర్గమాత మండపాలలో అర్చకస్వాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఇష్టమైన కట్టెపొంగలి, దద్ధోజనంతో నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ధన్వాడ: మండలంలోని గంగభవని దేవలయం, అంబభవని దేవాలయం, రజక సంఘం, మారుతి నగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

దామరగిద్ద: మండలంలోని భవాని ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన మంగళహారతి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోనిని కన్యకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వాసవి మాతను మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వాదం పొందారు.



నర్వలోని భవానీమాత ఆలయంలో భక్తుల పూజలు



అమ్మవారిని దర్శించుకున్న రామ్మోహన్ రెడ్డి



జాజాపూర్ ఈశ్వర్ మందిర్ లో..



మద్దూరులో పూజల్లో పాల్గొన్న మహిళలు



నారాయణపేటలో..

శక్తిపీఠాన్ని దర్శించుకున్న నటి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సంత్ మత మూల మహా సంస్థానం శక్తి పీఠం ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీ దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో బుధవారం సీరియల్ నటి ఉషశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని హోమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ గాయత్రి అష్టోతర శత నామాలతో కుంకుమార్చనలు చేశారు. తదనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



దామరగిద్దలోని భవానీమాత ఆలయంలో..